


# మోసపోయాను

నేను మోసపోయాను....అద్రోహి నా జీవితంతో చెలగాట మాడేడు....వశమయ్యేవరకూ ఎన్నో యుక్తులూ చమత్కారాలూ ప్రదర్శించి నా హృదయంలో స్థానం సంపాదించుకున్నాడు....నా పరిచయ భాగ్యానికి ఎంతో ఆత్రుత కనబరిచే వాడు....నేను కనికరించక పోతే ఆత్మహత్య చేసుకుంటానని బెదరించే వాడు.

నా హృదయం వెన్నలాంటిది.... అతని జాలిగొలిపే మాటలూ, మత్తెక్కించే చిలిపి చూపులూ నా హృదయాన్ని కరిగించేయి.... కాని అమనస్సే, అజాలే నా జీవిత సర్వస్వాన్నీ నాశనంచేసి, అధోగతికి యీడ్చుకొచ్చింది.

నేను మధ్యమ తరగతి కుటుంబంలో పుట్టాను....నా తండ్రి ఓచిన్న ఎయిడెడ్ పాఠశాలలో బడిపంతులు, నేనొక్కర్తె సంతానము కావటంవల్ల అతిగారాబంగా పెంచేడు.... అతి ముద్దువల్ల నయితేనేం, నా దౌర్భాగ్యం వల్ల నైతేనేం....నా జీవితం వంకర టింకర బాటలకు మళ్లింది....అమళుపు నా జీవిత పథాన్నే మార్చివేసింది.

బాల్యంనుంచీ కూడా నా ప్రవర్తనను అందరూ మెచ్చుకునేవారు, నాకు రంభా, మేనకలవంటి అపురూప సౌందర్యాన్నివ్వక పోయినా, మొదటి చూపుతోనే పురుషుణ్ణి నా వేపుమళ్లించుకొనే ఆకర్షణ నిచ్చాడా భగవంతుడు....నా తండ్రి నన్నుగూర్చి ఎన్నో పగటి కలలునేవాడు. నేనేదో త్రవ్వి తల కెత్తుతానని తలపోశాడా అల్పజీవి! ....కాని అవన్నీ ఎడారిలో "ఎండమావులే" అయాయి.

నేను పెద్ద విద్యావతిని కాకపోయినా, సంసారాన్ని చక్కదిద్దుకునేందుకు అవసరమయే యింతో అంతో విద్యను అభ్యసించాను. ప్రపంచాన్నర్థము చేసుకొనేపాటి లౌకిక జ్ఞానము సంపాదించుకొన్నాను....నా విజ్ఞానమూ, తెలివితేటలు నా జీవితాన్ని సురక్షిత మార్గముగుండా నడపడానికి అక్కరకు రాలేదు....చేతులు కాలేక ఆకులు పట్టుకుంటే ఏం ప్రయోజనం?

యుక్తవయస్కురాల నయాను.... ప్రతీ యువతీ తనభావిని గూర్చి కనే మధుర స్వప్నాలనేకన్నా .... నాకు రాబోయేవరుని గూర్చి ఆలోచనలు వచ్చినపుడల్లా నా బుగ్గలు సిగ్గుతో కెంపుల్లా ఎరుపెక్కేవి.... నాకు కాబోయే భర్త బడిపంతులు కావచ్చు ఛీ....పాడు ఆలోచనలు....చక్కా ఓ ఆఫీసరు కావచ్చు· నాదురాశను నేనేనిందించుకున్నా, ఓసాధారణ బడిపంతులి కూతురికి అంత అర్హత ఎక్కడిది? నా తండ్రి తనశరీరంలోని

రచన: అవధానుల అన్నాజీరావ్

ఒక్కొక్క రక్తబిందువునీ చిందించి, సగం పస్తులతో కడుపుకట్టుకుని సంపాదించినదంతా ఓ వేయిరూపాయిలయేసరికి తలప్రాణం తోకకువచ్చింది.

ఈ కాలంలో ఆడదై పుట్టడంకన్నా అడవిలో మానై పుట్టడంమేలు .... సమాజం ఎప్పటికేనా మారుతుందా?....కట్నాల మహమ్మారిపీడ విరగడపుతుందా?....యింకా నాలాంటి ఎంతమంది అభాగినుల అమూల్యమైన శీలాన్ని బలి గొంటుందో?....

నా తండ్రి నాకు సంబంధాలు వెతకసాగాడు....కొన్ని నచ్చేవికావు....నచ్చిన సంబంధాలు మా అందుబాటులో ఉండేవి కావు....అయినా నా యీదీన జీవితగాథ ఎవరికీ ఏవిధంగానూ, ఉపయోగించదు. అయినా నా హృదయ వేదన తీర్చుకోడానికి యిదిచెప్పవలసి వచ్చింది....నా జాలిగాథవిని మీ హృదయం కరిగి ఓ కన్నీటి బిందువు రాలిస్తే అదేనాకుచాలు.

అబ్బా! ఆ వ్యక్తిపేరు తలచుకొంటే ఒళ్లు జలదరిస్తుంది....నాదేహంలోని ప్రతి అణువూ భయంతో కుంచించుకుపోతుంది, "మోహన్!" ఎంత అందమైనపేరు....కాని ఆ అందంలోనే నా జీవితాన్ని నాశనంచేసే బుసలుకొడుతూన్న విషసర్పముందని గ్రహించలేక పోయాను, మోహన్, తేనేపూసిన కత్తి.... ఎంత తియ్యాగావుండేవి ఆ పలుకులు.... ఆ కొంటె చూపులూ, చిలిపినవ్వూ సూటిగా బాణంలా నా హృదయాన్ని నాటుక పోయాయి.

నా తండ్రి చేసిన వివాహయత్నాలు ఫలించలేదు. ఈ ఆలోచనలతో రాత్రిం బవళ్లు చింతించి, చివరకు గుండె జబ్బుకులోనై తగిన మందూ....మాకూలేక, మనశ్శాంతి లేక పాపకూపమైన యీ లోకాన్నివదలి, ఏ చీకూ చింతాలేని అమరలోకాన్ని చేరుకున్నాడు....ఇప్పటికీ అతని ఆత్మ నా గూర్చి యింకా తీరని ఆరాటంతో బాధపడుతున్నాదేమో?

ప్రపంచంలో నేను ఏకాకిని. నా అన్నవారు ఎవరూలేరు....నాకష్ట సుఖాలు పంచుకోడానికీ, నన్నుకాపాడటానికీ నాకో ఆధారము కావాలనిపించింది....యిలాంటి పరిస్థితులలో మా యింటి కెదురుగాఉన్న గదిలో మోహన్ అనే కాలేజీ అబ్బాయి అద్దెకు దిగేడు.

నా తండ్రి మిగిల్చిన కొద్దిపాటి ధనంతో, ఏకాకి జీవితము ఆరంభించా....నేను థర్డు ఫారము పాసయ్యాను.... టీచరు ట్రయినింగయి ఉద్యోగము చేద్దామనిపించింది. ఒంటరి స్త్రీ ఉద్యోగముచేస్తే యింకేమన్నావుందా? ఒంటిగా కనిపించె స్త్రీలను తీక్షణదృష్టులతో చూచేపురుషుల బారినుండి తప్పించుకోవడమెలా?....అనే సందేహము నా ఆలోచనలకు బ్రేకు వేసింది.

వేలకొలదీ కట్నాలు కుమ్మరించినా పెళ్లి కాని యీ గడ్డు దినాల్లో నిరాధారనైన, బీదయువతియైన నన్ను నా అంద చందాలు చూసి వివాహమాడే విశాల హృదయు లెవరు?

మోహన్‌ను పలకరించాలని ఎంతో యత్నించా .... కాని తీరా ఎదురయేసరికి దేహమంతా వణకిపోయి మాటలు వచ్చేవి కావు. నాలోని యీదుర్బలత్వాన్ని నేనే నిందించుకున్నా....కాని అతన్ని పలుకరిస్తే యింకేమన్నావుందా?

అతన్ని చూడకుండా వుండలేక పోయే దాన్ని. చూడకూడదని ఎన్నిసార్లు అనుకున్నా అప్రయత్నంగా నా కళ్లు అతని చూపులతో చూపులు కలిపేవి.

ఓనాడు బజారుకెళ్లి వస్తూంటే, 'ఏమండీ?' అన్నపిలుపువిని వెనుతిరిగి చూచాను.... నన్నే కాదో అని వెనుదిరిగి చూచి నన్నేనని నిశ్చయించుకుని "పిలిచారా?" అన్నా సిగ్గుతో తలవంచుకుని. "పాపం....మీదీనస్థితి నాకెంతో బాధ కల్గిస్తున్నాదండీ...." అన్నాడు సానుభూతితో.

"మీ అభిమానానికి ధన్యవాదాలు...." అని యింటి ముఖంపట్టా. ఆ రాత్రల్లా ఏవో మధురానుభూతులూ, తీయనికలలూ. మోహన్ మొదట్లో చాలా మంచివాడు లా అగుపించాడు .... చిలిపినవ్వులతో నా హృదయాన్ని చూరగొన్నాడు, నాకు వివాహమయే సూచనలు కనిపించలేదు, అయినా నాకున్న సర్వస్వము వరకట్నానికే చాలదు. నావివాహయత్నాలు నేనెలా చేసుకోవడం? యుక్తవయస్కురాలయాక వివాహంకాని కన్యబాధ, విద్యాభ్యాసము పూర్తయ్యాక నిరుద్యోగిగానున్న యువకునిబాధ వర్ణనాతీతము. అమ్మలక్కల ఎగతాళి మాటలు, వెన్నెలరాత్రులు ప్రజ్వలింపజేసే తీయని కోరికలు....అన్నిటినీ మించిన మోహన్ చిలిపిచూపులు దానికి తాళము వేసే నావయసూ నా నిగ్రహాన్ని సడలించినయి.

ఓ నాడు సినిమాకని బయలుదేరా.... హాల్లో కూర్చుని చిత్రంలో లీనమయ్యా.... ఇంతలో నా భుజంమీద ఏదో వాలినట్టయింది....ఆ వెచ్చనిస్పర్శ నాకేదో తీయని అనుభూతిని, అమరానందాన్ని యిచ్చింది. ఆ చేతిని తొలగిద్దామని అనుకున్నా కాని ఆ వాతావరణము నున్న ప్రతిఘటించింది.

అతను మోహనే! సిగ్గుతో తలవాల్చా.... "మౌనం అర్ధాంగీకారమ"ని భావించాడేమో, నా నడుముచుట్టూ చేయిపోనిచ్చాడు. అడ్డు పెట్టకపోయా. సినిమా అయిందికాబోలు.... దీపాలు వెలిగాయి. ఇద్దరమూ తలలు వంచుకుని రోడ్డుమీద కొచ్చాం....

"ఏమండీ?....అలా చల్లగాలికి బీచి కెళదామా?" అన్నాడు మోహన్ ప్రాధేయంగా చూస్తూ .... కాదనలేక పోయా .... మౌనంగా అతని ననుసరించా .... ఆ ద్రోహి వగలాడి మాటలకు మోసపోయి .... దొంగప్రమాణాలను గుడ్డిగానమ్మి నాజీవితసర్వస్వాన్నీ అతని కర్పించా!

క్షణికోద్రేకంలో అతనికి లొంగిపోయాను! నా జీవితానుభవాన్నిబట్టి నాతోటి సోదరస్త్రీలకు జీవితంలో మోసపోవద్దని హెచ్చరిస్తున్నా... కొంతకాలంవఱకు మా ప్రేమ సాఫీగానే సాగిపోయింది. మొదట్లో మోహన్ నన్నెంతగానో ప్రేమించి నాకు అమరసౌఖ్యాన్ని ప్రసాదించేడు.

ఎంత మరుద్దామన్నా మరపురాడా ద్రోహి! మళ్ళా ఎన్నటికైనా కన్పిస్తాడేమోనని ఆశగా ఎదురుచూస్తున్నా! ఆశ అనేది ప్రతిజీవినీ అంత్యక్షణందాకా పీడిస్తుంది....ఆశ అనేదే లేకపోతే ఈ సృష్టి ఏనాడో అంతమయేది.

మోహన్ నన్ను నిర్లక్ష్యంచేసేవాడు. నేను వివాహమాడమని బ్రతిమాలినపుడల్లా ఏదో నెపంతో తప్పించుకునేవాడు.

కొద్దిరోజులయి మోహన్ మా యింటికి రావటము మానేసాడు .... నా మనసు ఏదో కీడును శంకించ నారంభించింది. మాయిరువురి సంబంధము అప్పుడే ఊళ్ళో అందరకూ తెలిసిపోయింది. నేనే ధైర్యముచేసి ఓ రాత్రి మోహన్‌లాడ్జికి వెళ్ళి ఆ యింటివాళ్ళ నడిగా మోహన్ ఏమైనాడని? పదిహేను దినాలయి గది ఖాళీచేసి ఎక్కడికో పోయాడనే సమాధానం వినేసరికి నా గుండెలలో వేయి అగ్నిపర్వతాలు బ్రద్దలయాయి .... నా కాళ్లక్రింద భూమి చీలికలయిందేమో ననిపించింది. స్పృహతప్పి నేలమీద పడిపోయాను. కొద్దిసేపటికి స్పృహవచ్చి భారంగాకాళ్లీడ్చుకుంటూ ఱెక్కలూడినపక్షిలా యింటికి చేరుకున్నా!

చాలారోజులు మోహన్ తిరిగివస్తాడేమో అని ఆశగా ఎదురుచూసా! ఆ ఆశ ఆశగానే వుండిపోయింది. జీవితంలో నాలా ఎవరూ మోసపోరు. "స్త్రీ అవివేకి! ఉద్రేకంలో విచక్షణాజ్ఞానం కోల్పోతుందనడానికి "నా యీ దీనజీవితగాథ ప్రబలతార్కాణము. నాకేమి చేయడానికీ పాలుపోలేదు.

మోహన్ మీద కోపంతో తీవ్రప్రతీకార వాంఛతో పతితనై పయోముఖవిషకుంభాలైన పురుషుల జీవితాలను నాశనం చేస్తున్నా! వజ్రాన్ని వజ్రంతోనే కొయ్యాలి .... మోసానికి మోసమే ప్రతిక్రియ. నేను సంఘందృష్టిలో ఒక చీడపురుగును, నన్నందరూ హీనంగా చూస్తారు. ఏవగించుకుంటారు కాని, ఓనాడు సమాజంలో గౌరవంగా బ్రతికిన నన్ను ఈ నరకానికి యీడ్చినందుకు బాధ్యులెవరు??

ఇదీ నాజీవితగాథ! ఇంతకూ మీ రెవరండీ? అనవసరంగా నా విషాదగాథతో మీ అమూల్యమైన కాలాన్ని పాడుచేసా. మన్నించండి! అయినా మీరు నా గాథ నమ్మరు. ప్రతీపతిత తన పతనానికి ఏదో గాథ చెపుతూంటుంది. కొన్ని సత్యాలు కావచ్చు .... మరికొన్ని కల్పితాలూ కావచ్చు.

ఆ అగంతకుడు పెద్దగావుకేక వేస్తూ కన్నీటితో నా కాళ్లపైపడి "క్షమించు పద్మా!" .... నేనే ఆ ద్రోహిని. నీ జీవితసర్వస్వాన్నీ నాశనముచేసి నిన్ను అధోగతికి యీడ్చుకొచ్చిన పరమ కిరాతకుడను నేనే ఆ మోహన్‌ను.... చదువున్నా సంస్కారమూ, విశాల హృదయమూలేక, నీలాంటి అమాయికజీవిని. అటు కట్నంకోసం అఱ్ఱులుచాచే దురాశాపరులైన తల్లి దండ్రుల నెదిరించలేక, ఇటు ఏ పాప మెరుగని నీకు సమాధానం చెప్పలేక, దేశ ద్రిమ్మరినయ్యా! యింకా నన్ను పోల్చలేకపోయావా? పద్మా! ....

ఆనాడు నిన్ను మోసగించి, ఊరు విడచి చివఱకు తిండీ గుడ్డాలేక బికారివలె పస్తులతో మాడి, దొంగతనంచేసి జైలులో కఠినశిక్ష అనుభవించి ఈ దినమే విడుదలై నీ కోసం అన్వేషిస్తూ వచ్చా! ఆ భగవంతుడు నా ద్రోహానికి తగిన శిక్షే విధించేడు. నీలాంటి అబలను వంచించినందుకు....అయినాపద్మా! నా పాపాలను, ద్రోహాన్ని ఆ భగవంతుడు కూడా మన్నించడు!....నీకోసం గాలిస్తు ఇలా వచ్చా....ఈనాడు నా పాపానికి నిష్కృతి కనిపించింది.

''పద్మా! ఈ ద్రోహిని మన్నించి నీ హృదయంలో స్థానం యివ్వగలవా?'' అన్న మోహన్‌మాటలు ఆమె నవ్వులో కలిసేయి.

★